RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసీమ గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 360 | 20 శుక్రవారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

స్టాలిన్‌ను ఓడించిన వీఎస్ బాబు కన్నుమూత

2

తమిళనాడు అసెంబ్లి ఎన్నికల్లో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌పై గెలిచిన టీవీకే ఎమ్మెల్యే వీఎస్ బాబు (75) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు.



మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

2

- ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న నామినేషన్ల పరిశీలన.. 27న ఉపసంహరణకు అవకాశం
- డిసెంబర్ 2న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు



ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోబోటిక్ సర్జరీలు.. ప్రణాళికలు రూపొందిస్తున్న ఏపీ ప్రభుత్వం

అమరావతి, నవంబర్ 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బోధనాసుపత్రులలో రోబోటిక్ శస్త్రచికిత్సలను ప్రవేశపెట్టాలన్న దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోబోటిక్ శస్త్రచికిత్సను ప్రవేశపెట్టే దిశగా ఏపీ వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ముందుగా విజయవాడలోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో రూ. 45 కోట్లతో రోబోటిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ఐవీఎఫ్, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు, ఇతర సౌకర్యాల కల్పనకు రూ. 1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలకు రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించింది. రోగుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో వెంటిలేటర్ల సదుపాయాన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కల్పించాలనుకున్నట్లు తెలిపింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి: ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, రాజధాని వాయిస్ : విశాఖపట్నం అంతర్జాతీయ ప్రమాణాలతో విశాఖ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలుగు దేశం పార్టీ విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన జరుగుతున్నాయని వెల్లడించారు. గురువారం విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఎంపీ పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్, రైల్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడారు. కోర్టు కేసులతో అభివృద్ధి పనులు ఒక సంవత్సరం ఆలస్యమయ్యాయని వివరించారు. 2028 డిసెంబరు నాటికి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఈ స్టేషన్‌లో ప్లాట్ ఫారంలు 8 నుంచి 14కు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో..

ప్లాట్ ఫామ్‌లు పెరగడంతో రైల్వేస్టేషన్ ఔటర్‌లో రైలు నిరీక్షణ సమస్యకు తెరపడుతుందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు పెరుగుతాయని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ సౌకర్యాలు పెరుగుతాయని అన్నారు. 450 కార్లు, 2000 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకునేలా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. విశాఖ రైల్వేస్టేషన్ దేశంలోనే బెస్ట్ రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందాలని చెప్పారు. ఈ స్టేషన్‌లో రైన్ హార్వెస్టింగ్ , సోలార్ సిస్టం, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు.

మూడు ఆర్థిక ప్రాంతాలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్: చంద్రబాబు

- విశాఖ బే-టెక్ సిటీగా అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి
- తిరుపతిని ప్రపంచ సెమీకండక్టర్ డిజైన్ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
- అమరావతిని క్వాంటం వ్యాలీగా, క్వాంటం కారిడార్‌గా అభివృద్ధి
- పెట్టుబడులతో పాటు ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు పెరగాలి



అమరావతి, రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ సమగ్రాభి వృద్ధికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలే అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మూడు ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు ఆకర్షించడం మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగు పడినప్పుడే నిజమైన పురోగతి సాధించినట్లవుతుందని పేర్కొన్నా రు. రాష్ట్రంలో తలసరి ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. విశాఖపట్నం ఆర్థిక ప్రాంతంలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా పేరు ఖరారు చేశారు. హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను అభివృద్ధి చేసిన తరహాలో విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. విశాఖ ఆర్థిక ప్రాంత పరిధిలో మొత్తం 167 ప్రాజెక్టులు ఉండగా, ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు సమీక్షలో వెల్లడించారు. నగర మేయర్‌కు ఆర్థిక ప్రాంత స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాల ని చెప్పారు. విజయనగరం, అనకాపల్లి వైపు నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ముందుగానే భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో భూముల లభ్యత తక్కువగా ఉన్నందున పారిశ్రామిక అవసరాలకు ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక భూ విధానం తీసుకురావాలని సూచించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు. తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని ప్రపంచస్థాయి సెమీకండక్టర్ డిజైన్ కేంద్రంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు లక్ష్యం గా నిర్దేశించారు. ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష పరిశోధన, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయడంతో పాటు ఈ ఆర్థిక ప్రాంత పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని చెప్పారు. తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు, వాటిలో రూ.5.70 లక్షల కోట్లు గ్రీన్ ఎనర్జీ - 2లో..

2027 జనగణనలో కులగణనకు ప్రత్యేక కాలమ్ ఉండాలి: జగన్

- కులగణన సమన్వయ కమిటీ ప్రతినిధులతో సమావేశం
- బీసీల కుల వివరాల నమోదుకు ప్రత్యేక అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- కుటుంబాల ఆర్థిక స్థితిగతుల వివరాల సేకరణకూ సూచన
- సమగ్ర కులగణనతోనే సామాజిక న్యాయానికి అవసరమైన గణాంకాలు

అమరావతి, రాజధాని వాయిస్ : 2027 జనగణనలో కులగణనకు సంబంధించిన అంశాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అఖిల భారత కులగణన సమన్వయ కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాబోయే జనగణనలో కులాల వివరాల నమోదు, సామాజిక వర్గాల సమస్యలు, సమగ్ర గణాంకాల సేకరణకు సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి సాధించాలంటే కచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా జగన్ అభిప్రాయపడ్డారు.జనగణనలో ఇతర వెనుకబడిన తరగతులు, ఆయా రాష్ట్రాల్లోని వెనుకబడిన తరగతుల వివరాల నమోదుకు




తప్పనిసరిగా ప్రత్యేక కులం కాలమ్ ఉండాలని కమిటీ ప్రతినిధులు కోరినట్లు జగన్ వెల్లడించారు. 2027 జనగణనలో ఈ అంశాన్ని చేర్చడం ద్వారా 2లో..

తిరుమలకు కూడా ఎల్‌నినో ఎఫెక్ట్.. అప్రమత్తమైన టీటీడీ

- తిరుమలలో రోజుకు 50 నుంచి 60 లక్షల గ్యాలన్ల నీటి వినియోగం
- ప్రస్తుతం ఉన్న నిల్వలు 120 రోజులకు సరిపోతాయని అంచనా
- హోటళ్లు, మఠాలకు రోజుకు రెండు గంటలే నీటి సరఫరా

తిరుపతి, రాజధాని వాయిస్ : తిరుమలలో శ్రీవారి భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అప్రమత్తమైంది. ఎండల తీవ్రత, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతుండటంతో ముందస్తుగా నీటి పొదుపు, యాజమాన్య చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సుమారు 120 రోజుల అవసరాలకు సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు.తిరుమలలో భక్తుల రద్దీని బట్టి రోజుకు దాదాపు 50 నుంచి 60 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో సగం నీటిని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాల నుంచి తీసుకుంటున్నారు. మిగిలిన సగం తిరుపతి సమీపంలోని కల్యాణి డ్యామ్ నుంచి సరఫరా చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలతో కొంత ఊరట లభించినప్పటికీ, భవిష్యత్ అవసరాల దృష్ట్యా టీటీడీ పొదుపు చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా ప్రైవేటు హోటళ్లు, మఠాలు, వాణిజ్య సముదాయాలకు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. అవసరమైతే ప్రైవేటు హోటళ్లు తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండితే 18 నెలల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోతే, కల్యాణి డ్యామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ వనరుల నుంచి నీటిని తీసుకురావాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.



జలాశయాల్లో పూడికతీత, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి లీకేజీల నివారణపై కూడా టీటీడీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

'అక్వాన్' కదలిక.. భారీ నష్టానికి సంకేతమా?

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తీవ్ర తుపాను తీరం వైపు చాలా నెమ్మదిగా కదులుతోంది. ఒక దశలో గంటకు కేవలం 3 కి.మీ వేగాన్నే కొనసాగించింది. శుక్రవారం ఏపీలోని నరసాపురం, ఒడిశాలోని పూరీ మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఇంతకు ముందు ఏర్పడిన మురసు, అర్నబ్ తుపాన్లతో పోలిస్తే.. మరీ తక్కువ వేగంతో కదలడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు అక్వాన్ మరీ అంత నెమ్మదిగా ఎందుకు కదులుతోంది? దీనివల్ల నష్ట తీవ్రత పెరిగే అవకాశం ఉందా?

నెమ్మదిగా కదలడానికి కారణమేంటి?

తుపాను ముందుకు కదలడానికి భూ ఉపరితలంపై గాలులు, పీడన వ్యవస్థల తోడ్పాటు అవసరం. గాలులు బలహీనంగా ఉంటే తుపాను చురుగ్గా తీరం వైపు కదులుతుంది. కానీ, ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల వల్ల సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. గాలులు వ్యతిరేక దిశలో వీస్తున్నాయి. దీనికితోడు బంగాళాఖాతంలో వరుస తుపాన్లు ఏర్పడుతున్నాయి. దీంతో వాతావరణంలో సంక్లిష్టత పెరిగి.. తుపాను కదలిక నెమ్మదిగా ఉన్నట్లు వాతావరణ 2లో..

షర్మిలకు అండగా విజయమ్మ బహిరంగ లేఖ!

చంద్రబాబుకు శుభలేఖ ఇవ్వడంలో తప్పేముంది?

అమరావతి, రాజధాని వాయిస్ : వైఎస్ షర్మిలకు జరుగుతున్న అన్యాయం, ఆమెపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలు ఒక తల్లిగా తన మనసును తీవ్రంగా కలచివేస్తున్నాయని వైఎస్ విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయమ్మ పేరుతో విడుదలైన ఒక బహిరంగ లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే తన బిడ్డ షర్మిలపై జరుగుతున్న ఈ పరిణామాలను చూసి ఎంతో బాధపడేవారని ఆ లేఖలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ ప్రకారం.. ముఖ్యమంత్రి చంద్రబాకి తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించడంలో ఎలాంటి తప్పులేదని విజయమ్మ సమర్థించారు. వైఎస్సార్, చంద్రబాబు మధ్య రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, దాదాపు 50 ఏళ్ల క్రితమే వారిద్దరి మధ్య వ్యక్తిగత స్నేహం ఉండేదని గుర్తుచేశారు. ఒక తండ్రి వయసున్న వ్యక్తికి, తండ్రి మిత్రుడికి వెళ్లి శుభలేఖ ఇవ్వడం సంస్కారమని పేర్కొన్నారు. రాజకీయాలు వేరు, మానవ సంబంధాలు వేరు అని వైఎస్సార్ బలంగా నమ్మేవారని, రాజకీయ ప్రత్యర్థులతో కూడా గౌరవప్రదమైన సంబంధాలను కొనసాగించిన చరిత్ర ఆయనదని వివరించారు.ప్రస్తుతం రాజకీయ లబ్ధి కోసం సొంతవారే తప్పుడు రాతలు రాస్తూ, వ్యక్తిత్వంపై బురదజల్లుతుండటం అత్యంత బాధాకరమని విజయమ్మ విమర్శించారు. 2లో..



స్టాలిన్‌ను ఓడించిన వీఎస్ బాబు కన్నుమూత



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌పై గెలిచిన టీవీకే ఎమ్మెల్యే వీఎస్ బాబు (75) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొళత్తూరు నుంచి టీవీకే తరఫున బరిలో దిగిన వీఎస్ బాబు.. స్టాలిన్‌ను ఓడించి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. శ్వాసకోశ సంబంధిత సమస్యతో సెప్టెంబర్ 9న చెన్నైలోని ఎంజీఎం హెల్త్‌కేర్‌లో చేరిన ఎమ్మెల్యేని కాపాడేందుకు వైద్య బృందం ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయన పరిస్థితి మరింత క్షీణించిందని, ఆ తర్వాత గుండెపోటు రావడంతో మధ్యాహ్నం ప్రాణాలు విడిచారని వైద్యులు వెల్లడించారు.

సీఎం విజయ్ తీవ్ర విచారం.. ఏడు రోజుల సంతాప దినాలు

తమ పార్టీ ఎమ్మెల్యే వీఎస్ బాబు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సీఎం విజయ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజల్లో ఒకరిగా జీవిస్తూ.. జీవితాన్ని పూర్తిగా ప్రజా జీవితానికే అంకితం చేసి అందరి ప్రేమాభిమానాలను చూరగొన్నారని, ఆయన మరణం తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు, వీఎస్ బాబు మృతి నేపథ్యంలో పార్టీ 7 రోజుల పాటు సంతాప దినాలు పాటించాలని నిర్ణయించింది. టీవీకే చీఫ్ అనుమతితో పార్టీకి సంబంధించి అన్ని కార్యక్రమాలను ఏడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు మంత్రి, టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ వెల్లడించారు. సంతాప సూచికంగా తమ పార్టీ జెండాను అవనతం చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి

తనపై ఎమ్మెల్యేగా గెలిచిన వీఎస్ బాబు మరణంపై మాజీ సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "వీఎస్ బాబు మరణ వార్త నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఆసుపత్రిలో అనేక రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం మెరుగుపడుతోందని సమాచారం అందుతూ వచ్చిన తరుణంలో అకస్మాత్తుగా మరణించారన్న వార్త దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

షర్మిలకు అండగా విజయమ్మ బహిరంగ లేఖ!


షర్మిలను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. షర్మిల గతంలో చేసిన పాదయాత్రలు, పడిన కష్టాలు, ఎదుర్కొన్న ఇబ్బందులు సామాన్యమైనవి కావని, వైఎస్సార్ జీవించి ఉన్న సమయంలో ఎన్నడూ ఇలాంటి దిగజారుడు రాజకీయాలను ప్రోత్సహించలేదని తెలిపారు. వైఎస్ కుటుంబ వారసత్వం అంటే కేవలం పదవులు, ఆస్తులు మాత్రమే కాదని, ప్రజల పట్ల ప్రేమ, మాట తప్పని నైజం, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటమే అసలైన వారసత్వమని విజయమ్మ స్పష్టం చేశారు. షర్మిలలో రాజశేఖర్ రెడ్డి గారి ఆలోచనా విధానం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, పోరాట పటిమ స్పష్టంగా కనిపిస్తాయని ప్రశంసించారు. ఎన్ని అవమానాలు, కష్టాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొనే శక్తి ఆమెకు ఉందని, ఈ తప్పుడు ప్రచారాలు ఆమెను బలహీనపరచలేవని భరోసా ఇచ్చారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలని, అంతేకానీ కుటుంబ బంధాలను, మహిళల ఆత్మగౌరవాన్ని రాజకీయాలకు బలి చేయవద్దని విజయమ్మ హితవు పలికారు. వైఎస్సార్ ఆశయాలు, విలువల గురించి మాట్లాడే ప్రతి ఒక్కరూ ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని, షర్మిల చేసిన త్యాగాలను, పడిన కష్టాన్ని ఎవరూ మరచిపోకూడదని ఆమె ఆ లేఖలో పిలుపునిచ్చారు.

మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ



విజయవాడ, రాజధాని వాయిస్ : రాష్ట్రంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మూడో విడత ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటిస్తూ, నిర్ణీత గడువులో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేపట్టాలని ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు నామినేషన్లను స్వీకరించనున్నారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ గడువులోగా తమ నామినేషన్ పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. చివరి రోజు వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుండటంతో అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు సూచిస్తున్నారు.నామినేషన్ల స్వీకరణ పూర్తయిన అనంతరం నవంబర్ 24వ తేదీన వాటి పరిశీలన నిర్వహించనున్నారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలు, అర్హతలు, ఇతర వివరాలను ఎన్నికల అధికారులు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న నామినేషన్లను ఆమోదిస్తారు. నామినేషన్లపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ ఉపసంహరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు, ఇతర వివరాలను వెల్లడించనున్నారు.డిసెంబర్ 2వ తేదీన అవసరమైన ప్రాంతాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఓటింగ్ పూర్తయిన వెంటనే అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచించింది. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికైన వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి నిబంధనల ప్రకారం ఉపసర్పంచ్‌ను ఎన్నుకోనున్నారు. మూడో విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతుండగా, ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేయనున్నారు.

మూడు ఆర్థిక ప్రాంతాలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్: చంద్రబాబు



రంగానికి సంబంధించినవని వివరించారు. అరుదైన భూ ఖనిజాల వినియోగానికి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని, మూడేళ్ల లక్ష్యంతో ఉద్యానవన పంటల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అమరావతి ప్రాంతాన్ని భవిష్యత్తులో క్వాంటం కారిడార్‌గా, క్వాంటం వ్యాలీగా, క్వాంటం తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. మచిలీపట్నం, రామాయపట్నం ఓడరేవులతో అనుసంధానం పెంచడంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమవుతుందని పేర్కొన్నారు. భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలను అందించేలా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సూచించారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలని, పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను తిరిగి పొందే సాంకేతికతలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి విద్యాసంస్థలను నాలెడ్జ్ భాగస్వాములుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలో పర్యాటకాన్ని ఆదాయాన్ని సమకూర్చే కీలక రంగంగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, ఇతర మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సుకు వచ్చే ప్రతినిధులను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, గండికోట పర్యాటక ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిఫై చేయాలని ఆదేశించారు. ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అమరావతి నుంచి నాగార్జునకొండ వరకు బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ పథకం కింద ప్రతిపాదించిన రూ. 9,180 కోట్ల విలువైన 60 ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో విశాఖ, తిరుపతి, అమరావతి ఆర్థిక ప్రాంతాల ముఖ్య కార్యనిర్వహణ అధికారులు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెక్కలి మండల పరిషత్ అధ్యక్షురాలు, 21 మంది ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం



టెక్కలి, రాజధాని వాయిస్ : టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో నూతన మండల పరిషత్ అధ్యక్షురాలు, 21 మంది ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల పరిషత్ అధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవకు అంకితమై పనిచేయాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఈ సందర్భంగా సూచించారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా నూతన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పదవులు ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశాలని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నూతన పాలకవర్గం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అవసరమైన సేవల మెరుగుదల వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని స్పష్టం చేశారు.టెక్కలి మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నూతన పాలకవర్గం సమష్టిగా పనిచేయాలని అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పారదర్శకమైన, మెరుగైన పాలన అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవాలని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల పరిషత్ అధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల ఆశీస్సులతో టెక్కలి మండల అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

2027 జనగణనలో కులగణనకు ప్రత్యేక కాలమ్ ఉండాలి: జగన్



సంబంధిత సామాజిక వర్గాల జనాభా వివరాలను సమగ్రంగా నమోదు చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కులగణన ప్రక్రియలో ఎవరూ మినహాయింపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రతి కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు సమగ్ర కులాల ఎంపిక జాబితాను అందుబాటులో ఉంచాలని కమిటీ ప్రతినిధులు మరో కీలక సూచన చేసినట్లు తెలిపారు. కులాల పేర్లను నమోదు చేసే విధానంలో స్పష్టత ఉండాలని, ఏ కులం కూడా గణనకు దూరం కాకుండా చూడాలని కోరినట్లు చెప్పారు. ఇందుకోసం జనగణన ప్రక్రియలో కులాల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ జాబితాను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రస్తావించారు.కుటుంబాల ఆర్థిక పరిస్థితులను తెలియజేసే సూచికలను కూడా జనగణనలో భాగం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరినట్లు జగన్ తెలిపారు. కులాల వారీగా జనాభా వివరాలతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై సమాచారం సేకరిస్తే సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో వాస్తవ గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు.కులగణన అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ తన వైఖరికి కట్టుబడి ఉందని జగన్ వెల్లడించారు. సమగ్ర కులగణన కోసం పార్టీ తరఫున డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. సామాజిక న్యాయం మాటలకే పరిమితం కాకుండా, వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే గణాంకాల ఆధారంగా విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత లక్ష్యబద్ధంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని వివరించారు. 2027 జనగణనలో కులాల వివరాల నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం, సమగ్ర కులాల జాబితా రూపొందించడం, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను నమోదు చేయడం వంటి కమిటీ ప్రతిపాదనలను తీవ్రంగా పరిశీలించాలని జగన్ కోరారు. కులగణన ద్వారా లభించే సమాచారం ఆధారంగా ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు రూపొందించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ఈ డిమాండ్లకు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

దేవాలయ చోరీల నిందితుడి అరెస్టు.. రూ.48 లక్షల ఆభరణాలు స్వాధీనం

కాకినాడ,రాజధాని వాయిస్ : కాకినాడ జిల్లాలో వరుసగా దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొత్తం 12 చోరీ కేసులను ఛేదించారు. నిందితుడి నుంచి సుమారు రూ.48 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వరుస దేవాలయ చోరీల ఘటనలపై దృష్టి సారించిన పోలీసులకు ఈ అరెస్టుతో కీలక పురోగతి లభించింది.జిల్లాలోని పలు దేవాలయాల్లో చోటుచేసుకున్న చోరీలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరుస ఘటనలకు సంబంధించి ఆధారాలను సేకరిస్తూ నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నించారు. దర్యాప్తులో లభించిన వివరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చేపట్టి చోరీలకు సంబంధించిన వివరాలను రాబట్టారు. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా మొత్తం 12 కేసులను పోలీసులు ఛేదించారు. ఆయా ఘటనలకు సంబంధించి నిందితుడి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి మొత్తం విలువ సుమారు రూ.48 లక్షలుగా పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలు దేవాలయ చోరీలకు సంబంధించినవిగా గుర్తించారు. దేవాలయాల్లో చోరీలు జరగడం భక్తుల్లో ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో వరుస ఘటనలను పోలీసులు తీవ్రంగా పరిగణించి దర్యాప్తును కొనసాగించారు. కేసులను ఛేదించేందుకు చేపట్టిన చర్యలు ఫలించడంతో నిందితుడి అరెస్టుతో పాటు చోరీ సొత్తును కూడా రికవరీ చేయగలిగారు.కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన పోలీసు బృందాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు. దర్యాప్తులో భాగస్వాములైన సిబ్బంది కృషిని ప్రశంసించారు. చోరీ కేసులను సమర్థంగా ఛేదించి విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకే నిందితుడి అరెస్టుతో 12 దేవాలయ చోరీ కేసులు వెలుగులోకి రావడం, రూ.48 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం కావడం పోలీసుల దర్యాప్తులో కీలక విజయంగా నిలిచింది. ఈ కేసుల ఛేదనలో పాల్గొన్న బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించడంతో పోలీసు శాఖలో సిబ్బంది కృషికి గుర్తింపు లభించింది.

'అక్వాన్' కదలిక.. భారీ నష్టానికి సంకేతమా?

శాఖ నిపుణులు చెబుతున్నారు.

నెమ్మదిగా కదిలితే తీవ్రత ఎక్కువా?

తుపాను కదిలే వేగం దాని తీవ్రతను నిర్ధరించనప్పటికీ.. ఒక ప్రాంతంలో కురిసే వర్షం పరిమాణాన్ని ప్రభావితం చేస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 2021లో హైడ్రోమెట్రాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. తుపాను కదిలే వేగానికి, దానివల్ల కురిసే వర్షపాతానికి మధ్య సంబంధం ఉంది. 2010-2019 మధ్య తీరాన్ని తాకిన 280 తుపాన్లపై అధ్యయనం చేయగా.. నెమ్మదిగా కదిలే తుపాన్ల వల్ల ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ వర్షం కురిసినట్లు తేలింది. కొన్ని సందర్భాల్లో బలహీనమైన తుపానుల వల్ల కూడా తీవ్రమైన వరదలు వచ్చినట్లు గుర్తించారు. కేవలం తుపాను వేగం మాత్రమే వరద తీవ్రతను నిర్ణయించలేదని పరిశోధకులు తేల్చారు. 'నేచర్ కమ్యూనికేషన్'లో మరో అధ్యయనం ప్రచురితమైంది. 2001 నుంచి 2021 వరకు ఏర్పడిన కొన్ని తుపానుల వల్ల కలిగిన వర్షపాతాలను ఉపగ్రహాల ఆధారంగా లెక్కించారు. వేగంగా కదిలే తుపాను వల్ల సగటున 24శాతం వర్షపాతం అధికంగా నమోదైనట్లు తేల్చారు. ఈ రెండు అధ్యయనాలను పరిశీలిస్తే.. నెమ్మదిగా కదిలే తుపాను ప్రభావం ఒక ప్రదేశంలో ఎక్కువగా ఉంటుంది. సగటు వర్షపాతం రేటు తక్కువగా ఉన్నప్పటికీ.. ఇది ఒక ప్రాంతంలో వర్షపాతాన్ని అధికంగా నమోదు చేస్తుంది. అందువల్ల తుపాను వేగం కంటే.. దాని తీవ్రత, పరిమాణం, వర్షపాత విస్తరణ, వాతావరణ వ్యవస్థలతో చర్యల వంటివి నష్టాన్ని ప్రభావితం చేస్తాయని పరిశోధకులు తేల్చారు.

ఉపమాక శ్రీవారి సేవలో హోంమంత్రి వంగలపూడి అనిత

- నక్కపల్లి ఎంపీటీసీ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు



నక్కపల్లి.నవంబర్ 19రాజధాని వాయిస్ : నక్కపల్లి మండలం ఉపమాకలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం దర్శించుకున్నారు. నక్కపల్లి మండల ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆమెకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన హోంమంత్రి, వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. ఆలయ అధికారులు ఆమెకు, వెంట వచ్చిన ప్రజాప్రతినిధులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ముఠా అరెస్ట్

నలుగురు నిందితుల నుంచి 145 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి స్వాధీనం
పల్నాడు ఎస్పీ జగదీష్ అదహళ్లి



నరసరావుపేట. నవంబర్ 19 రాజధాని వాయిస్ : తాళం వేసిన ఇళ్లల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను నరసరావుపేట రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టుబడిన వారిలో ఒక బాలుడితో పాటు నరసరావుపేట వడ్డవల్లికి చెందిన రాజవరపు గోపీచంద్ అలియాస్ గోపి (22), సత్తెనపల్లి అచ్చంపేట రోడ్డుకు చెందిన దాలి మల్లికార్జునరావు (31), కొండపల్లి తిరుపతయ్య అలియాస్ తిరుపతి (34) ఉన్నారు. వీరు చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేసేందుకు దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారని ఎస్పీ తెలిపారు. నరసరావుపేట రెండవ పట్టణ, దాచేపల్లి, పిడుగురాళ్ల, ముప్పాళ్ల, మార్టూరు, కాకుమాను పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరు చోరీలకు పాల్పడ్డారు. నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని నవయుగ ఫంక్షన్ హాల్ సమీపంలో నివసించే చిలంకూరి ఉమాదేవి దంపతులు జూన్ 28న హైదరాబాద్‌లోని తమ కుమారుడి వద్దకు వెళ్లి జులై 4న తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.11.13 లక్షల విలువైన 108 గ్రాముల బంగారం, 220 గ్రాముల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఎస్పీ ఆదేశాలతో అదనపు ఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. నరసరావుపేటలోని చంద్ర షాపింగ్ మాల్ పక్క బజారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వీరి వద్ద నుంచి ఈ కేసుకు సంబంధించిన 95 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండితో పాటు మరో 50 గ్రాముల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు. కేసును ఛేదించిన అదనపు ఎస్పీ ఎం. హనుమంతరావు, నరసరావుపేట రెండవ పట్టణ సీఐ ఎ. సురేంద్రబాబు, దాచేపల్లి సీఐ షేక్ ఖాజావలి, ఎస్సైలు సౌందర్ రాజన్, ఖాసిం వలి, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలి

బ్యాలెట్ పేపర్లు, టెండర్ ఓట్లు, ఛాలెంజ్ ఓట్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ, రాజధాని వాయిస్ మొదటి విడత పంచాయతీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, ఐఏఎస్ సూచించారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఎన్నికల విధివిధానాలు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి అధికారి అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, టెండర్ ఓట్లు, ఛాలెంజ్ ఓట్లు, బ్యాలెట్ బాక్సుల పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని, ఓటింగ్ సమయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా నిబంధనలకు అనుగుణంగా ప్రతి బాధ్యతను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా మొదటి విడత పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశించారు.


శ్రీ కనకదుర్గమ్మ భక్తుల సేవలో యూనియన్ బ్యాంక్

- దేవస్థానం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు అత్యవసర మందుల అందజేత



విజయవాడ, రాజధాని వాయిస్ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తనవంతు సహకారం అందించింది. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు అవసరమైన అత్యవసర మందులను యూనియన్ బ్యాంక్ అధికారులు అందజేశారు. ఈ మేరకు గురువారం ఉదయం విజయవాడలోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన అధికారులు దేవస్థానాన్ని సందర్శించి, అత్యవసర వైద్య పరిస్థితుల్లో భక్తులకు ఉపయోగపడే విలువైన మందులను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్‌కు అందజేశారు. ఇంద్రకీలాద్రికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారని, దర్శన సమయంలో అనారోగ్య సమస్యలు లేదా ఇతర అత్యవసర ఆరోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఈ మందులు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు అవసరమైన అత్యవసర మందులను అందజేసిన యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవలో భాగస్వాములవుతూ సామాజిక బాధ్యతను చాటుకున్న యూనియన్ బ్యాంక్ అధికారులను అభినందించారు.

భవానీ మండల దీక్షల ప్రారంభానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



విజయవాడ, రాజధాని వాయిస్ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో నవంబర్ 20 నుంచి ప్రారంభం కానున్న భవానీ మండల దీక్షలను పురస్కరించుకుని దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) వి.కె. శీనా నాయక్ తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు చేపట్టే భవానీ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, కలశ జ్యోతి ఊరేగింపు నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. దీక్షల ప్రారంభం నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈవో సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

భూ సమీకరణ అభ్యంతరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

నిడమర్రు, నవులూరు గ్రామాల్లో 22(ఏ) అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



గుంటూరు, రాజధాని వాయిస్ : సీఆర్‌డీఏ రెండో విడత భూ సమీకరణకు సంబంధించి రైతులు, భూయజమానుల నుంచి అందిన అభ్యంతరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సీఆర్‌డీఏ రెండో విడత భూ సమీకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమీకరణకు సంబంధించి ఇప్పటివరకు అందిన అభ్యంతరాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. భూయజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా నిడమర్రు, నవులూరు గ్రామాల్లో 22(ఏ) కింద ఉన్న భూములకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి, భూ సమీకరణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. భూయజమానులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, వారి అభ్యంతరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూములకు సంబంధించి ఆయా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భూ సమీకరణ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కార మార్గాలు అన్వేషించాలని తెలిపారు. అభ్యంతరాల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెన్సస్--2027 సన్నద్ధతలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ పూర్తి

శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి: డీఆర్ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి



గుంటూరు, రాజధాని వాయిస్ సెన్సస్--2027 నిర్వహణకు అవసరమైన సన్నద్ధతలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ, సెన్సస్--2027 నిర్వహణలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర కీలకమని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సందేహాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని ఇతర సిబ్బందికి సమర్థవంతంగా బోధించి, సెన్సస్--2027 నిర్వహణ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సస్ కోఆర్డినేటర్లు ఆదిలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు

రిటైర్డ్ హోంగార్డుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం

ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించిన పల్నాడు జిల్లా హోంగార్డులు..
చెక్కును అందజేసిన ఎస్పీ జగదీష్ అదహళ్లి



పల్నాడు, రాజధాని వాయిస్ : తోటి ఉద్యోగి పట్ల మానవతా దృక్పథంతో పల్నాడు జిల్లా హోంగార్డులు ఆదర్శంగా నిలిచారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు ఎస్. నాగేశ్వరరావుకు జిల్లా హోంగార్డులందరూ తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందజేసి రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేశారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించిన ఎస్. నాగేశ్వరరావు (హెచ్‌జీ 642) పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ఆయనకు అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లాలోని హోంగార్డులందరూ తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించి మొత్తం రూ.5 లక్షలను సమకూర్చారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.5,00,000 విలువైన చెక్కును పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ నాగేశ్వరరావుకు తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రిటైర్డ్ హోంగార్డు నాగేశ్వరరావుకు తోటి హోంగార్డులందరూ తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సహాయం హోంగార్డుల మధ్య ఉన్న ఐక్యతకు, మానవతా దృక్పథానికి, సాటి ఉద్యోగి పట్ల వారు చూపిస్తున్న ఆప్యాయతకు నిదర్శనమని అన్నారు. విధి నిర్వహణలోనే కాకుండా కష్టసమయాల్లోనూ ఒకరికొకరు అండగా నిలవడం గొప్ప విషయమని ప్రశంసించారు. తోటి ఉద్యోగి పదవీ విరమణ అనంతరం కూడా ఆయనకు ఆర్థికంగా అండగా నిలిచిన పల్నాడు జిల్లా హోంగార్డుల సేవాభావాన్ని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా.. 100 మీటర్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి: అదనపు ఎస్పీ ఎల్. శేషాద్రి

పల్నాడు, రాజధాని వాయిస్ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఎల్. శేషాద్రి గురువారం బెల్లంకొండ మండల పరిధిలోని మన్నె సుల్తాన్‌పాలెం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద కొనసాగుతున్న ప్రక్రియను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు, ప్రతిపాదకులు ఎన్నికల నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించారు.

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాల్లో ప్రతి కదలికను పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని అదనపు ఎస్పీ సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బాడీ వార్న్ కెమెరాలు ధరించాలని స్పష్టం చేశారు. ప్రతి సంఘటన రికార్డు అయ్యేలా చూడటంతో పాటు విధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు.

100 మీటర్ల పరిధిలో కట్టుదిట్టమైన భద్రత

నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో అనధికార వ్యక్తులు, వాహనాలు, గుంపులు ప్రవేశించకుండా పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థితో పాటు నిబంధనల ప్రకారం అనుమతించబడిన వ్యక్తులను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి గందరగోళం, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా గ్రామాల్లో మొబైల్ పెట్రోలింగ్‌ను ముమ్మరం
చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా ఉంచాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. ఎవరైనా గొడవలకు ప్రేరేపించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎల్. శేషాద్రి సూచించారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

కారంపూడి మండల ఎంపీపీగా తండా మస్తాన్ జానీ

వైస్ ఎంపీపీగా పాలెపోగు నిర్మల ప్రమాణ స్వీకారం


కారంపూడి. నవంబర్ 19 రాజధాని వాయిస్ : మండల పరిషత్ అధ్యక్షుడిగా తండా మస్తాన్ జానీ, ఉపాధ్యక్షురాలిగా పాలెపోగు నిర్మల గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మండలంలోని ఎంపీటీసీ సభ్యులందరూ మస్తాన్ జానీ అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతూ చేతులెత్తారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.అనంతరం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ తండా మస్తాన్ జానీ మాట్లాడుతూ, ఎంపీపీగా తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, తన ఎన్నికకు మద్దతు తెలిపిన ఎంపీటీసీ సభ్యులకు, మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ పాలెపోగు



నిర్మల మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, నాయకులు పంగులూరి అంజయ్య, మునుగోటి సత్యం, చప్పిడి రాము, గోళ్ళ సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ, కటికల బాలకృష్ణ, బొల్లినేడి శ్రీనివాసరావు, ఎస్.పి.ఆర్. కృష్ణ, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


కొండమోడు సర్పంచ్ అభ్యర్థిగా బత్తుల నామినేషన్ దాఖలు

రాజుపాలెం నవంబర్ 19 రాజధాని వాయిస్: సత్తెనపల్లి నియోజకవర్గం,రాజుపాలెం మండలం, కొండమోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు తండ్రి వెంకట్రావు నామినేషన్ వేయటం జరిగింది.యువత రాజకీయాలలోకి రావాలన్న జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాజకీయాలలోకి వచ్చి పార్టీలో అనేక పదవులు అధిరోహించి, ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో నూతనంగా ఏర్పడిన కొండమోడు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయాలనే పట్టుదలతో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ పెద్దల ఆశీస్సులతో నామినేషన్ వేశారు.ఈ సందర్భంగా హనుమంతరావు మీడియాతో మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని, త్రాగునీరు,డ్రైనేజీవ్యవస్థ, రోడ్లు,పంచాయతీభవనం, సచివాలయం,ఆరోగ్య కేంద్రం, మౌలిక సదుపాయాలు ఇలా ఎన్నో ఉన్నాయని, గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీసుకురావాలంటే కూటమి ప్రభుత్వం బలపరిచిన నన్ను గ్రామ ప్రజలు సర్పంచ్ గా ఎన్నుకుంటే సిఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం,మరియు పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్,ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయలు,మాజీమంత్రి,టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే కన్నా



లక్ష్మినారాయణ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు అంకాళ్ల ప్రభుదాస్,ఎంపిటిసి బుర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరంపాడు సర్పంచ్ అభ్యర్థిగా యర్రంశెట్టి తులశమ్మ నామినేషన్



రాజుపాలెం. నవంబర్ 19 రాజధాని వాయిస్: దేవరంపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల కోలాహలం, మద్దతుదారులు, వార్డుల మెంబర్ లతో కలిసి గ్రామంలో ఉన్నదేవాలయాలు, చర్చిలు,గుడులలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, కుమారుడు యర్రంశెట్టి భరత్ కుమార్ ప్రోత్సాహంతో యర్రంశెట్టి తులశమ్మ భర్త రామారావు నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, చిన్న గ్రామమైన దేవరంపాడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే ప్రజలు తమ ఓటుతో అత్యధిక మెజార్టీతో గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.


దుర్గి ఎంపీపీగా యాగంటి నాగలక్ష్మి

దుర్గి. నవంబర్ 19 రాజధాని వాయిస్ : మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా యాగంటి నాగలక్ష్మి(అడిగోప్పల – 1 ఎంపీటీసీ) ఉపాధ్యక్షులుగా గాలి పద్మావతి (కోలగుట్ల ఎంపీటీసీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు ప్రకటించారు. పల్నాడుజిల్లా కలెక్టర్ ఆదేశాలు, ఎన్నికల కమిషన్ సూచనలు మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక, ప్రమాణ స్వీకారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి జగ్గారావు ముందుగా నూతనంగా ఎంపికైన 14 మంది మండల పరిషత్ పాలకమండలి సభ్యులందరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్ష పదవికి ఎన్నిక ప్రారంభించారు. ఆర్వో14 మంది సభ్యులు హాజరుకావడంతో అధ్యక్ష పదవికి ఎన్నిక ప్రారంభించారు. అడిగోప్పల – 1 ఎంపీటీసీ సభ్యురాలు యాగంటి నాగలక్ష్మి అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఆమెను కాకిరాల ఎంపీటీసీ సభ్యులు పాశం కొండలు ప్రతిపాదించగా,దుర్గి ఎంపీటీసీ–2 నక్కనబోయిన కొండలు బలపర్చారు.అధ్యక్ష పదవికి నాగలక్ష్మి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్వో ప్రకటించారు. అదే విధంగా ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక ప్రారంభించగా కోలగుట్ల ఎంపీటీసీ గాలి పద్మావతి ఉపాధ్యక్ష పదవికి నామినేషన్ వేయగా,ఆమెను ముటుకూరు ఎంపీటీసీ – 1 సభ్యులు మాచర్ల రత్తమ్మ ప్రతిపాదించగా, కంచర గుంట ఎంపీటీసీ శ్రీపతి ముక్కంటి బలపర్చారు. ఆమెకు ఎవరు



పోటికీ రాకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్వో ప్రకటించారు. అనంతరం అధ్యక్ష,ఉపాధ్యక్షులచే ప్రమాణ స్వీకారం చేయించి ధృవీకరణ పత్రాలను అందజేశారు.నామినేషన్ల పర్వం నుంచి అధ్యక్ష ఎన్నిక వరకు ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరగడానికి సహకరించిన కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బందికి ఆర్వో జగ్గారావు కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను కార్యాలయ ఉద్యోగులు శాలువాలతో సన్మానించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దుర్గికి విచ్చేసి గౌరవ ఎంపీటీసీ సభ్యులతో కలిసి గ్రూపు ఫోటో దిగారు.తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికు యాగంటి నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.ఈసందర్భంగా ఎంపీపీ వర్గీయులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాదరావు, తహశీల్దార్ వరకుమార్ ఉన్నారు.

సర్పంచ్ అభ్యర్థిగా ప్రత్తిపాటి వెంకయ్య నామినేషన్



రాజుపాలెం.నవంబర్ 19రాజధాని వాయిస్ :మండలంలోని దేవరంపాడు గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ పదవి జనరల్ గా రిజర్వేషన్ గా ప్రకటించారు.ఈ ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎస్సీ కమ్యూనిటీకి చెందిన ప్రత్తిపాటి వెంకయ్య తండ్రి చిన్న వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు. వెంకయ్య తన మద్దతుదారులు, వార్డు మెంబర్లతో కలిసి ఊరేగింపుగా పెద్ద నెమలి పూరి గ్రామ సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాన్ని అభివృద్ధి చేయాలంటే మీ అమూల్యమైన ఓటు హక్కుతో గెలిపిస్తే,టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు సత్తెనపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 29.29 లక్షలు

దుర్గి.నవంబర్ 19 రాజధాని వాయిస్ : శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులను గురువారం లెక్కించగా 63 రోజులకు గాను రూ. 29,29,478 ఆదాయం సమకూరింది. దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, కోటప్పకొండ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌ల పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది, భక్తులు ఈ లెక్కింపు ప్రక్రియను నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కాకర్ల ఆదిశేష నాయుడు తెలిపారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల ప్రథమ కర్తవ్యం


మాచర్ల. నవంబర్ 19 రాజధాని వాయిస్ : ఎంపీపీలు, ఎంపీటీసీలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు సూచించారు. దుర్గి, మాచర్ల రూరల్, వెల్దుర్తి మండలాల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీలు, ఎంపీటీసీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో వస్తున్న అభివృద్ధి నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలని



పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఘనంగా కూటమి ఎంపీపీలు ఎంపీటీసీల, ప్రమాణ స్వీకారోత్సవాలు

ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యం
ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



వెల్దుర్తి ఎంపీపీ ముడావత్ శారదా బాయి వజ్రం నాయక్



మాచర్ల వైస్ ఎంపీపీ సింపిరెడ్డి సుధాకర్ రెడ్డి



మాచర్ల ఎంపీపీ బోయ గోపిరెడ్డి

మాచర్ల.నవంబర్ 19 రాజధాని వాయిస్ : వికసిత గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా కూటమి ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు.గురువారం మాచర్ల నియోజకవర్గ పరిధిలోని వెల్దుర్తి, మాచర్ల రూరల్ మండలాల్లో నూతనంగా ఎన్నికైన కూటమి ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో 14 మంది ఎంపీటీసీలతో పాటు ఎంపీపీ గా మూఢావత్ శారదాబాయి వజ్రం నాయక్, వైస్ ఎంపీపీగా దేశ్యావత్ సాంబ్లూ మల్లయ్య నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు.మాచర్ల రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 14 మంది ఎంపీటీసీలతో పాటు ఎంపీపీగా బోయ గోపిరెడ్డి, వైస్ ఎంపీపీగా సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు ప్రజాప్రతినిధులుగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. పదవులకు వన్నె తెచ్చేలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్య క్రమాల్లో ఆయా మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయ కులు, నూతన ప్రజాప్రతినిధుల అభిమానులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితా
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై
సమగ్ర నివేదిక ఇవ్వాలి
కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్



బాపట్ల.నవంబర్ 19రాజధాని వాయిస్ : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా దరఖాస్తుల స్వీకరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. డిసెంబర్ 15 వరకు అభ్యంతరాలు, మార్పులు చేర్పుల దరఖాస్తులను స్వీకరించి పరిష్కరిస్తామని, డిసెంబర్ 22న తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా కేంద్రాలతో పాటు 400 మందికి పైగా ఓటర్లున్న చోట సీసీ కెమెరాల ఏర్పాటుకు విద్యుద్దీకరణ చేయాలన్నారు. గ్రామ పెద్దలు, సామాజిక వర్గాలు, మత పెద్దలతో వీఆర్వోలు సమావేశమై ప్రశాంత ఎన్నికలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. మూడో దశ పంచాయతీ ఎన్నికల ప్రకటన విడుదలైనందున పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ భవనాల్లో అదనపు కేంద్రాలు పరిశీలించాలని, ప్రతి కేంద్రంలో కనీస వసతులు, పరిశుభ్రత, పెయింటింగ్, నోటీసు బోర్డులో ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అని స్పష్టం చేశారు. సామగ్రి తరలింపునకు సర్వేయర్లు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని, ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, 10 శాతం ఉద్యోగులను రిజర్వులో ఉంచాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లు వేగవంతం చేయాలన్నారు.
ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నగేష్ కుమారి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com